క్లుప్తంగా

మంత్రి రాజనర్సింహకు సత్కారం



దామోదర రాజనర్సింహను సత్కరిస్తున్న రవీందర్‌నాయక్

ఆమనగల్లు: రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహకు ఆమనగల్లు పట్టణంలో గురువారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు వెళుతున్న ఆయనకు ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కృష్ణనాయక్, మేడిగడ్డ రవీందర్‌నాయక్, వస్పుల శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఖేల్ ఇండియా'కు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన డీపీఎస్ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెన్నైలో నిర్వహిస్తున్న ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌కు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) జాఫర్ గూడ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పి.వన్షిక, టి.గ్రీష్మ, జి.జ్వాలా దర్శిని, జి.శ్రీజ, ఎస్.నీక్ష, పి.స్ఫూర్తి, స్వేచ్ఛ, ఐశ్వర్య ఖేలో ఇండియా యూత్‌కు ఎంపికైనట్లు డీపీఎస్ యాజమాన్యం తెలిపింది.

ఆటపాటలతో ఎయిడ్స్‌పై అవగాహన

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్లె సుద్దుల కళాబృందం ఆటపాటలతో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును శనివారం ఇబ్రహీంపట్నంలోని లేబర్ అడ్డాలో నిర్వహించారు. హెచ్ఐవీ ఏలా సంక్రమిస్తుంది.. రాకుండా ఉండాలంటే ఏం చేయాలి.. ఎక్కడ పరీక్షలు చేయించుకోవాలి ఇలా అనేక అంశాలను ఆటపాటలతో ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ అనిల్, కౌన్సిలర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డిప్యూటీ ఈఈగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: ఆమనగల్లు పంచాయితీరాజ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈగా శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమనగల్లు పీఆర్ డిప్యూటీ ఈఈగా పనిచేసిన యాదగిరి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. హయత్‌నగర్‌లో ఏఈగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి డీఈఈగా పదోన్నతి కల్పించి.. ఆమనగల్లుకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఐలయ్య తదితరులు

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధే ధ్యేయంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య తెలిపారు. శనివారం పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని నవభారత్ కాలనీ, రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్, ప్రగతి నగర్‌లలో బీటీ రోడ్డు పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆలయాల శుద్ధి

తుక్కుగూడ: అయోధ్యలో సోమవారం జరగనున్న శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ వై శివకుమార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు.

సారు.. మళ్లీ వస్తారట!

- తుర్కయంజాల్ వచ్చేందుకు గత మున్సిపల్ కమిషనర్ తీవ్ర ప్రయత్నాలు
- ఆయన సర్వీసులో ఉండగా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలు
- వాహనాల కొనుగోళ్లలో చేతివాతం ప్రదర్శించారనే అపవాదు
- పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని పలువురు స్థానికులు, కౌన్సిలర్ల డిమాండ్



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: గతంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారి తిరిగి ఇక్కడికి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం ప్రస్తుతం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. యూనియన్ లీడర్ కావడం, రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఆయన రావడం పెద్ద విషయమేమీ కాదని తెలిసిన వారు చెబుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సదరు అధికారి సర్వీసులో ఉన్న సమయంలో మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల బదిలీల్లో భాగంగా గతేడాది జూలై నెల చివర్లో ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో స్థానికులు, పలువురు ప్రజాప్రతినిధులు సంతోషపడ్డారు. కానీ కమిషనర్ సార్ వెళ్తూవెళ్తూ.. 'ఎన్నికలు ముగియగానే మళ్లీ వస్తా' అని చెప్పుకొంటూ మరీ వెళ్లారట. అసలు సారుకు ఈ కుర్చీపై ఎందుకంత మమకారం అని కొంతమంది ముక్కున వేలేసుకుంటున్నారు. ఆయన ఉండగా మున్సిపాలిటీ చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్ద ఎత్తున ఆరోపణలు..

- స్వచ్ఛ సర్వేక్షణ్– 2022లో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల జాబితాలో తుర్కయంజాల్‌కు స్వచ్ఛ సర్వేక్షన్ (2022లో) అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రోత్సాహకంగా గత ప్రభుత్వం మున్సిపాలిటీకి రూ.2 కోట్ల నిధులను కేటాయించింది. ఈ డబ్బులతో రూ.22 లక్షలు వెచ్చించి ఇసుజు కారు, రూ.32 లక్షలతో క్యాప్టెన్ కంపెనీకి చెందిన రెండు మినీ లోడర్లు, రూ.36 లక్షలతో మూడు టాటా ఏస్ వాహనాలు, రూ.42 లక్షలు వెచ్చించి మహీంద్ర ప్రొక్లెయినర్ కొనుగోలు చేశారు. అయితే మార్కెట్ ధరకన్నా ఎక్కువ రేటుకు వీటిని కొనుగోలు చేశారనే ఆరోపణలు అప్పట్లో దుమారం రేపాయి.
- సుమారు రూ.60 లక్షల అంచనా వ్యయంతో టాటా కంపెనీకి చెందిన స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేయగా.. యంత్రం వచ్చిన ఒక్క రోజులోనే ఆయిల్ లీక్ అయ్యింది. సరిచేయిస్తామని తీసుకెళ్లిన కాంట్రాక్టర్ రెండు నెలల తర్వాత తెచ్చాడు. దీనికి సంబంధించి ఇప్పటి వరకూ మున్సిపల్ సిబ్బందికి డెమో నిర్వహించలేదు. దీంతో వాహనం నిరుపయోగంగా ఉంది.



వృథాగా పడి ఉన్న స్వీపింగ్ మిషన్

దీని కొనుగోలులో కూడా అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి.

- నిండు కుండలా ఉన్న మాసబ్ చెరువులో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి నింపి అన్యాక్రాంతానికి ప్రయత్నించారు. ఇది పెద్ద ఉద్యమానికే దారి తీసింది. ఆక్రమణలను అడ్డుకునేందుకు స్థానికులంతా జేఏసీ ఏర్పాటు చేసుకుని రాత్రింబవళ్లు గస్తీకాశారు. అప్పట్లో పనిచేసిన కమిషనర్ ఈ విషయమై బాధ్యతాయుతంగా లేకపోవడంతో చెరువుకు నష్టం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువులో కబ్జాదారులు డంప్ చేసిన మట్టి ఇప్పటికీ అలాగే ఉంది.

అయోధ్య అక్షితల ఊరేగింపు



అక్షితలను ఊరేగిస్తున్న భక్తులు

కడ్తాల్: అయోధ్య ఆలయం నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షితలను శనివారం మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకు ముందుకు స్థానిక ఆలయంలో అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మంజుల, ఉప సర్పంచ్ గణేశ్, నాయకులు నర్సింహాగౌడ్, యాదగిరి, మహేందర్‌గౌడ్, కవిత, సువర్ణ, కృష్ణయ్య, నరేశ్‌గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షితలు

తలకొండపల్లి: అయోధ్య ఆలయం నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షితలను మండల పరిధిలోని చుక్కాపూర్‌లో ఇంటింటికీ శనివారం పంపిణీ చేశారు. అక్షితలను భక్తులు గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించాలి

కాంగ్రెస్ నాయకుడు సత్యం

ఆమనగల్లు: స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు గ్రామీణ ప్రాంతాలలో సేవలను అందించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం కోరారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో సర్వ్ సీబీఆర్ దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని ఆసుపత్రి వైద్యులు 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. అంతకుముందు దివ్యాంగులకు దుప్పట్లు, కుట్టు మిషన్ మోటర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వ్ సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, అధ్యక్షురాలు మీనాక్షి, సిబ్బంది శ్రీనివాస్, ధనలక్ష్మి, సురేశ్, ప్రమీల, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యం

శివకుమార్‌కు బసవరత్న అవార్డు



బసవరత్న అవార్డు అందుకుంటున్న శివకుమార్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంకు చెందిన శెట్టి శివకుమార్‌కు బసవరత్న అవార్డు పురస్కారాన్ని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం నేతలు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయనను.. ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శెట్టి శివకుమార్ బసవరత్న అవార్డు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాంతోపాటు సంఘం నాయకులుభరత్, సోమేశ్, శివశరణ్

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి

ఇన్‌చార్జి ఎంఈఓ మనోహర్

కందుకూరు: బడుగు, బలహీన వర్గాల పిల్లల బాగు కోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కందుకూరు ఇన్‌చార్జి ఎంఈఓ మనోహర్ సూచించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభను నిర్వహించారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థ బాగు కోసం టీఎస్ యూటీఎఫ్ ముఖ్య భూమిక పోషించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగనాథ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల కల్లేష్, ప్రధానకార్యదర్శి జె.బుగ్గరాములు, ఉపాధ్యక్షుడు ఎల్.జగన్, జి.విజయలక్ష్మి, కార్యదర్శులు ఈశ్వర్, కుమార్, నజీర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు సెలవు ప్రకటించాలి

ఆమనగల్లు: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 22న ఆమనగల్లు మండలంలోని ప్రైవేటు పాఠశాలలకు సెలవు ఇవ్వాలని ఆమనగల్లు హిందూదళం సభ్యులు కోరారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం బాధ్యులు మహమూద్‌కు హిందూదళం సభ్యులు వినతి పత్రం అందజేశారు.

వెంకటయ్యకు సన్మానం



వెంకటయ్యను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: రాంపూర్‌కు చెందిన వెంకటయ్య ముదిరాజ్ ఇటీవల జిల్లా మత్స్యకారుల సొసైటీ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కల్వకుర్తి తాలుక ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి అనిల్, వెంకటయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రెంచ్ నిర్మాణం

చురుగ్గా కొనసాగుతున్న పనులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి వండర్‌లా వచ్చే రహదారికి ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహించి, రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ రోడ్డులో ప్రమాదాలను నివారించేందుకు, మురుగు నీరు పోవడానికి వీలుగా సైడ్‌ట్రెంచ్ నిర్మాణ పనులను చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్రెంచ్ పనులు గత కొద్ది రోజుల నుంచి చురుకుగా కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

వయోజనులు ఓటరుగా నమోదు చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరూ తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి వెంకట్రామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ వ్యాప్తంగా నేటి వరకు నూతన ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

షాద్‌నగర్: దేవునిపల్లి గ్రామంలో వేణుగోపాల స్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. శనివారం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ ఉత్సావాల్లో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, సర్పంచ్ చేగూరి రాఘవేందర్‌గౌడ్, కుమార స్వామి, రాజేందర్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, బసప్ప, నరేశ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆర్డీఓ శ్రీను

ఆమనగల్లు: అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను కోరారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం చేపట్టిన ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటు నమోదు, మార్పులు చేర్పుల కోసం రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు తహసీల్దార్ లలిత, పోలింగ్‌బూత్ అధికారులు ఉన్నారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలలో 13 మంది కొత్త ఓటు కోసం నమోదు చేసుకున్నారని తహసీల్దార్ లలిత తెలిపారు

ఓటు హక్కు అత్యంత విలువైనది

యాచారం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అంత్యంత విలువైనదని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. యాచారం, నందివనపర్తి తదితర గ్రామాల్లోని బీఎల్ఓ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఓటు వినియోగంపై బీఎల్‌ఓలు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు బీఎల్ఓ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం కూడా బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజకీయ పక్షాలు కూడ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓటు నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ

రేపు కొత్త ఓటర్ల నమోదు

మంచాల: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలని మంచాల తహసీల్దార్ వెంకట ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం కూడా గ్రామాల్లో బీఎల్‌ఓల ద్వారా కొత్త ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు.

యువత ముందుకు రావాలి

మంచాల: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంచాల తహసీల్దార్ వెంకటప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం కూడా గ్రామాల్లో బీఎల్‌ఓల ద్వారా కొత్త ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. యువత ముందుకు వచ్చి కొత్త ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఎంపీడీఓ రాఘవులు

మాడ్గుల: మాడ్గుల మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాఘవులు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాడ్గుల మండల 33వ విడత గ్రామ పంచాయితీలకు 13వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 1 మార్చి 2022 నుంచి మార్చి 31-2023 వరకు చేపట్టిన పనులపై తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ వేంకన్న, డీఆర్పీలు, ఏపీవోలు వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యాచారం: విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం మొగుళ్లవంపు, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

మంచాల: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా మంచాల, జాపాల సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10–00 గంటల నుంచి మధ్యాహ్నం 2–00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచాల సబ్‌స్టేషన్ పరిధిలోని మంచాల, చిత్తాపూర్, తాళ్లపల్లి గూడ, తిప్పాయి గూడ, లింగంపల్లి, నోముల, జైనమ్మ గూడ, మల్లికార్జునగూడ చుట్టు ప్రక్కల వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. జాపాల సబ్‌స్టేషన్ పరిధిలో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల కారణంగా.. జాపాల, రంగాపూర్, ఆస్మత్‌పూర్, చాంద్‌ఖాన్ గూడ గ్రామాల్లో ఉదయం 10–00 గంటల నుండి మధ్యాహ్న 2–00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



ప్రధానోపాధ్యాయురాలు విజయను సన్మానించిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్

కడ్తాల్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయ బదిలీపై వెళ్లారు. నూతన ప్రధానోపాధ్యాయురాలిగా అరుణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోవర్ధన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలని, జీవో 317 ద్వారా ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు చీమర్ల రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, లక్ష్మారెడ్డి, వినయ్, ధనంజయ్‌గౌడ్, మల్లయ్య, యాదయ్య, సుగుణ, తదితరులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



పనులు ప్రారంభిస్తున్న మేయర్ చిగురింత పారిజాతరెడ్డి

బడంగ్‌పేట్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతప్రమాణాలు పాటించాలని గుత్తేదార్లను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్ వైకుంఠపురం కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ నిమ్మల సునితతో మేయర్ పారిజాతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో సమస్యలు పరిష్కరిస్తూ, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, బంగారి బాబు, సుభాన్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అధికారులతో మేయర్ సమీక్షా సమావేశం

బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని మేయర్ చాంబర్‌లో అధికారులతో మేయర్ పారిజాతరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈలు బిక్కునాయక్, వినీల్‌గౌడ్, ఆర్వో చంద్రశేఖర్, టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప, సిబ్బంది పాల్గొన్నారు.